సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 25, జనవరి, 2023



బాలికల సంరక్షణ అందరి బాధ్యత

బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని జేసీ కూర్మనాథ్ చెప్పారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.59,100
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,279
3 శాతం జీఎస్టీతో	రూ.5,437
నవర (8 గ్రా)	రూ.43,496

గరిష్టం/కనిష్టం
31.7 /22.7

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం చలి తీవ్రత పెరిగింది. గాలిలో తేమ 57 శాతానికి పడిపోయింది.

న్యూస్‌రీల్

భవిష్యనిధి ఉద్యోగుల సమావేశం 27న

నెల్లూరు (అర్బన్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల పరిష్కారానికి నిధి ఆప్కేనికత్ 2.0 కార్యక్రమాన్ని ఈ నెల 27న పోతిరెడ్డిపాళెంలోని డాక్టర్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యనిధిపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సోమశిలలో 70.529 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 70.529 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1,999 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 304 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

జగనన్న చేదోడు గడువు 26న ఆఖరు

నెల్లూరు(వేదాయపాళెం): జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులు ఈ నెల 26వ తేదీలోపు ఆయా వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరం మూడో విడత జగనన్న చేదోడు పథకం ఆర్థిక సాయాన్ని ఈ నెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారని తెలిపారు. జగనన్న చేదోడు పథకంలో జిల్లాలో మొదటి విడత 16,563 మంది రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్స్‌కు రూ.16.56 కోట్ల ఆర్థిక సాయం, రెండో విడత 16,014 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.16.01 కోట్లు జమ చేశారన్నారు.

ఎస్‌ఐ శ్రీహరిబాబు సస్పెన్షన్

నెల్లూరు (క్రైమ్): నిబంధనలు అతిక్రమణతో పాటు వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్‌ఐ వి. శ్రీహరిబాబును సస్పెండ్ చేస్తూ ఎస్పీ సీహెచ్ విజయారావు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నెల్లూరు సీసీఎస్‌లో పని చేస్తున్న శ్రీహరిబాబు తిరుపతి జిల్లాకు వెళ్లారు. అనంతరం మ్యూచువల్‌పై నెల్లూరు జిల్లాకు వచ్చారు. వేదాయపాళెం ఎస్‌ఐగా విధుల్లో చేరారు. గతేడాది డిసెంబర్ 19న కోర్టులో ఎవిడెన్స్ ఉందని స్టేషన్‌లో చెప్పారు. బైక్‌పై వెళ్తూ మనుబోలు మండలం పరిధిలో విధినిర్వహణలో నిబంధనలు అతిక్రమించడంతో పాటు ఆయన వ్యవహార శైలిపై పలువురు ఫిర్యాదుల నేపథ్యంలో శ్రీహరిబాబును సస్పెండ్ చేసినట్లు సమాచారం.

వీఆర్‌కు దిశ స్టేషన్ ఎస్సై

పరిపాలనా పరమైన చర్యల్లో భాగంగా దిశ మహిళా పోలీసుస్టేషన్ ఎస్‌ఐ కె. లేఖాప్రియాంకను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో నుంచి రిలీవ్ అయి వీఆర్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రికవరీ

- ఉపాధి హామీ పథకంలో అక్రమాలు
- 2015–21 మధ్య కాలంలో రూ.14.27 కోట్ల దుర్వినియోగం
- ఇప్పటి వరకు రూ.3.45 కోట్లు మాత్రమే రికవరీ
- టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీగా గోల్‌మాల్
- 12 వేల మంది అక్రమార్కులుగా గుర్తింపు

పేదలకు కడుపు నింపే ఉపాధి పథకాన్ని గత ప్రభుత్వ హయాంలో అప్పటి టీడీపీ నాయకులు, ఉపాధి సిబ్బంది తమ జేబులు నింపుకునే పథకంగా మార్చుకున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు, అరకొర పనులతో పూర్తి చేసినట్లు రూ.వందల కోట్లు కొల్లగొట్టారు. అయితే సామాజిక తనిఖీల్లో వీరి అవినీతి బట్టబయలైనా, వేల మంది అక్రమార్కులని నిగ్గు తేల్చినా అవినీతికి మసిపూసి మట్టేసి కప్పెట్టేశారు. చివరకు చూపించిన అరకొర అవినీతి సొమ్మును రాబట్టడంలోనూ డ్వామా అధికారులు చతికిల పడ్డారు. పైగా అక్రమార్కులైన సిబ్బందిని కొనసాగిస్తూనే ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: గ్రామీణ ప్రాంతాల నుంచి జీవనోపాధి నిమిత్తం వెళ్లే వలసలు నివారించేందుకు ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకాన్ని కొందరు అక్రమార్కులు వరంగా మార్చుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టి నిధులు స్వాహా చేశారని సామాజిక తనిఖీల్లో నిగ్గు తేలింది. జిల్లా వ్యాప్తంగా 2015–21 మధ్య కాలంలో ఉపాధి హామీ సిబ్బందితో అక్రమార్కులు కుమ్మక్కై పథకాన్ని పక్కదారి పట్టించి రూ.వందల కోట్లు నిధులు స్వాహా చేశారు. అయితే సామాజిక తనిఖీల్లో తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని, అధికారులను లోబర్చుకుని అవినీతికి మసిపూసి మారేడు కాయ చేశారు. సామాజిక తనిఖీ అధికారులను అదిలించి, బెదిరించి తమ అవినీతిని మట్టేసి కప్పెట్టేశారు. చివరాఖరుకు రూ.14.27 కోట్లు మాత్రమే దుర్వినియోగం అయినట్లు లెక్కలు పక్కా చేశారు. 12 వేల మందికి పైగా అందులో అవినీతి పరులని నిర్ధారించి వారి నుంచి దుర్వినియోగం అయిన సొమ్మును రికవరీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అందులో రూ.3.45 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మిగతా మొత్తం చెల్లింపుల్లో అక్రమార్కులు మీనమేషాలు లెక్కిస్తుండగా, రికవరీ చేయాల్సిన అధికారులు ఉదాసీనత వైఖరితో ఇంకా రూ.11.42 కోట్లు మొండి బకాయిలుగా నిలిచిపోయాయి. బాధ్యులైన ఉపాధి పథకం సిబ్బందితో పాటు ప్రైవేట్ వ్యక్తులను వదిలేశారు. ఆనాడు అవినీతికి పాల్పడిన వారే ఇప్పటికీ ఉపాధి పథకంలో కొనసాగుతున్నారు. వీరి నుంచి అయినా రికవరీ రాబట్టే అవకాశం ఉన్నా.. అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు.

ఉద్దేశం మంచిదే

వ్యవసాయ కూలీలకు స్వగ్రామంలోనే ఏడాదికి 100 రోజులు కూలీ కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులు కల్పించడం, కాలువలు తవ్వడం, పంట కుంటలు, చెరువుల పూడికతీత, గ్రావెల్ రోడ్లు, నీటి కుంటలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం తదితర పనులకు ప్రాధాన్యం కల్పించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారు. నిబంధనలు ఉల్లంఘించడం, ఉద్దేశ పూర్వకంగా నిధులు స్వాహా చేసిన పనులు గుర్తించి రికవరీకి ఆదేశిస్తారు. అలా రికవరీకి ఆదేశించిన మొత్తం ఇప్పటి వరకు రూ.14.27 కోట్లుగా నిర్ధారించారు. ఇందులో 6,163 మంది సిబ్బంది, 6,085 మంది బయట వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేయాలని ఆదేశించారు. రికవరీకి డ్వామాలో ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగం ఉంది. అయినా రిక'వర్రీ'గా మారింది.



సైదాపురంలో సామాజిక తనిఖీ బృందం ఏర్పాటుచేసిన సమావేశం (ఫైల్)

రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

ఉపాధి హామీ పనులపై ప్రతి ఏడాది సామాజిక తనిఖీలు నిర్వహిస్తాం. సామాజిక తనిఖీల్లో రికవరీలు విధిస్తారు. ఇప్పటి వరకు రూ.14.27 కోట్ల రికవరీలు విధించారు. రూ.3.45 కోట్లు వసూలు చేశాం. మిగిలిన నగదు రికవరీ చేసేలా ప్రత్యేక దృష్టి సారిస్తాం. రికవరీలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– ఎం.వెంకట్రావ్, డ్వామా పీడీ



టీడీపీ హయాంలో అత్యధిక అవినీతి

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఉపాధి హామీ పథకంలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఉపాధి హామీ సిబ్బంది టీడీపీ నాయకులు కుమ్మక్కై ఉపాధి నిధులు స్వాహా చేశారు. ఆ మేరకు సామాజిక తనిఖీల్లో రూఢీ అయింది. చెక్ డ్యామ్‌లు, పంట కుంటలు చేపట్టకుండానే రూ.కోట్లు స్వాహా చేశారు. దుత్తలూరు, ఎస్ఆర్‌పురం, ఉదయగిరి, బాలాయపల్లి, చేజర్ల, వరికుంటపాడు తదితర మండలాల్లో ఉపాధి పనుల్లో భారీస్థాయిలో అవినీతి చోటు చేసుకుంది. దుత్తలూరు, ఎస్ఆర్‌పురం రెండు మండలాల్లోనే రూ.6.90 కోట్లు అవినీతి చోటు చేసుకోగా, ఆ మేరకు రికవరీకి ఆదేశించారు. 2015–19 తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో ఉపాధి పనుల్లో భారీస్థాయిలో అవినీతి చోటు చేసుకుంది. రికవరీపై సమీక్షలు, సమావేశాల్లో ఏర్పాటు చేయడం మినహా ఆశించిన వసూళ్లు లేవనే చెప్పాలి. సిబ్బందిని సస్పెన్షన్ చేయడం మినహా వారు స్వాహా చేసిన మొత్తం రికవరీ చేయడంలో విఫలమవుతున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో 1,228 మంది విద్యార్థులకు 128 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సూళ్లూరుపేటలో ఎస్‌వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి, నెల్లూరులోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌లో 10,483 మంది విద్యార్థులకు 824 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వెంకటగిరిలోని వైష్ణవి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో ఇద్దరు, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, నాయుడుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

27న పరీక్ష పే చర్చ

నెల్లూరు (టౌన్): దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంటరాక్టివ్ ప్రోగ్రాం పరీక్ష పే చర్చ–2022 కార్యక్రమం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఏడీ గ్లోరికుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీ తల్కటోరా స్టేడియం నుంచి పర్చువల్‌గా సంభాషించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ ఇండియా దూరదర్శన్ చానల్స్, ఆల్ ఇండియా రేడియో ద్వారా ప్రసారం కానున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు పీఎంఓ, ఎంఈఈ వెబ్‌సైట్ నుంచి లైవ్ వెబ్ స్ట్రీమింగ్, ఫేస్‌బుక్, స్వయంప్రభ చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలను ఆదేశించారు.

అవినీతి తహసీల్దార్లపై క్రిమినల్ కేసులు

- చవటపల్లి రిజర్వాయర్ భూసేకరణలో అక్రమాలు
- ముగ్గురు తహసీల్దార్లు, తొమ్మిది మంది నకిలీ రైతులపై కేసుల నమోదు



హమీద్



నాగరాజు



లావణ్య

సాక్షి, ప్రతినిధి నెల్లూరు: కలువాయి మండలంలోని చవటపల్లి రిజర్వాయర్ భూసేకరణలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ముగ్గురు తహసీల్దార్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి కలువాయి పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. కలువాయిలో అప్పట్లో పనిచేసి అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలిన తహసీల్దార్లు నాగరాజు, హమీద్, లావణ్యతో పాటు, తొమ్మిది మంది నకిలీ రైతులపైనా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. భూసేకరణలో రూ.1,43,06,500 దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమాలు జరిగింది ఇలా..

సోమశిల–కండలేరు వరద కాలువ (ఎస్‌కే ఎఫ్ఎఫ్) కింద మూడు చెరువులను రిజర్వాయర్లుగా మార్చారు. కలువాయి మండలం చవటపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చే క్రమంలో చవటపల్లి, వెరుగొట్లపల్లి వెదనపర్తి, దాచూరు గ్రామాల పరిధిలో దాదాపు 600 ఎకరాలకుపైగా ముంపునకు గురవుతాయని నిర్ధారించి ఆ పొలాలను ప్రభుత్వం సేకరించింది. ఎకరాకు రూ.6.50 లక్షల చొప్పున పరిహారాన్ని అందజేసింది. ఇందులో 150 ఎకరాలు వరకు ప్రభుత్వ భూమి, 218 ఎకరాలు పట్టా భూమి, మిగిలినవి సీజేఎఫ్ఎస్, డీకేటీ పట్టా భూములు ఉన్నాయి. 2018లో గత ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించింది. మరికొందరికి గతేడాది పరిహారం చెల్లించింది. కొందరు అక్రమార్కులు 30 ఎకరాల ప్రభుత్వ భూములను తమ పేర్లపై డీకేటీ పట్టాలుగా రికార్డులు మార్పు చేయించుకుని పరిహారం తీసుకున్నారు. ఇందుకు ముగ్గురు తహసీల్దార్లు రెవెన్యూ సిబ్బంది సహకరించారు. భూ రికార్డులు మార్పు చేసి పరిహారం పక్కదారి పట్టించారన్న ఆరోపణలపై కలెక్టర్ చక్రధర్‌బాబు ఆత్మకూరు ఆర్డీఓ ద్వారా విచారణ జరిపించారు. ఆర్డీఓ విచారణలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించడంతో ఆ ముగ్గురు తహసీల్దార్లను కలెక్టర్ సస్పెన్షన్ చేశారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న తహసీల్దార్లతో పాటు తొమ్మిది మంది నకిలీ రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలి
- అందరూ బాధ్యతగా వ్యవహరించాలి
- అందుబాటులో 108, 104 సేవలు
- ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్ తదితరులు

నెల్లూరు (పొగతోట): రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరు ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇస్తే ప్రమాదాలను అధిక శాతం నివారించవచ్చన్నారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలందరూ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తోందన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రాణ నష్టం జరగకుండా 108, 104 సేవలు అందుబాటులో ఉంచిందన్నారు. హెల్మెట్ ప్రతి ఒక్కరూ వినియోగించాలన్నారు. నిద్రలేమి, అలసట వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లకు తగిన విశ్రాంతి తీసుకునేందుకు వసతి సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇతర దేశాల్లో మూడు పర్యాయాలు నియమాలు పాటించకుండా ఉంటే డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేస్తారన్నారు. ఇక్కడ వాహనాన్ని పట్టుకుంటే సిఫార్సులు చేస్తున్నామన్నారు. వ్యవస్థల్లో మార్పులు రావాలన్నారు. 170 నుంచి 200 మోడల్స్‌కుపైగా వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరిలో స్వచ్ఛందంగా మార్పులు రావాలని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం, అలసత్వం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిల్డ్రన్స్ పార్క్, రూరల్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకు ముందు రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన కార్యక్రమాలపై రవాణాశాఖ ఉప కమిషనర్ చందర్ వివరించారు. రోడ్డు భద్రతలపై నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ రోణంకి కూర్మనాథ్, మేయర్ స్రవంతి, నేషనల్ హైవేస్ పీడీ గోవర్ధన్, జెడ్పీ సీఈఓ బి చిరంజీవి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, రోటరీ క్లబ్ గవర్నర్ సతీష్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, బంగే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి దక్షిణామూర్తి, రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కరణల సారథికి అవార్డుల కీర్తి

పాలనలో తన మార్క్ సంస్కరణలతో జిల్లా ప్రగతిని పరుగులు పెట్టిస్తున్న కలెక్టర్ చక్రధర్ బాబును మరోసారి అవార్డు వరించింది. ఇప్పటికే ఎనిమిది దఫాలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు వరించగా మరోసారి ఆత్మకూరు ఉప ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించినందుకు తాజాగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు లభించింది.

- రెండున్నరేళ్లలో తొమ్మిది జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు
- తాజాగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు
- నేడు గవర్నర్ చేతుల మీదుగా అందుకోనున్న కలెక్టర్

అందరి సహకారంతోనే..



జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు సహకారం అందించడంతోనే జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులు లభించాయి. సమష్టి కృషితోనే అవార్డులు సాధించగలిగాం. అన్ని రంగాల్లో జిల్లా ప్రగతి సాధించిందంటే అందరి సహకారంతోనే సాధ్యమవుతుంది.

– చక్రధర్‌బాబు, జిల్లా కలెక్టర్

ప్రత్యేక పురస్కారానికి ఎస్పీ ఎంపిక




నెల్లూరు(క్రైమ్): రాష్ట్రస్థాయి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టిసెస్ అవార్డ్ 2022 కింద ఎస్పీ సీహెచ్ విజయారావు ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యారు. గతేడాది ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు భారీ భద్రతా ఏర్పాట్లు నడుమ ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించినందుకు ఎస్పీ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 25న విజయవాడలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ఎస్పీ పురస్కారాన్ని అందుకోనున్నారు.

సాక్షి, ప్రతినిధి నెల్లూరు: 2020 జూలై 16న కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చక్రధర్‌బాబు రెండున్నర ఏళ్ల కాలంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకుంటూ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిలాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడంతో ఆయన సఫలీకృతులయ్యారు.

- ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) పథకం అమలుకు సంబంధించి జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జిల్లాలోని మారుమూల వెనుకబడిన గ్రామాలకు అన్ని మౌలిక వసతులు సమకూర్చడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకం అమలులో దేశం మొత్తం మీద మూడు జిల్లాలకు మాత్రమే అవార్డు దక్కగా అందులో రెండో స్థానంలో జిల్లా ఉంది. ఈ అవార్డు ద్వారా కలెక్టర్‌ను అభినందించడంతో పాటు ప్రత్యేకంగా రూ.10 లక్షల నగదు బహుమతిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- 2021లో జరిగిన తిరుపతి ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఉత్తమ ఎన్నికల అధికారిగా పురస్కారాన్ని అందుకున్నారు.
- 2021లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కలెక్టర్ నేతృత్వంలో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పూర్తిస్థాయిలో విజయవంతం చేశారు. రెవెన్యూ రికార్డులు సరి చేసి ఎక్కువ మంది రైతులకు పీఎం కిసాన్‌నగదు అందించడంలో కలెక్టర్ పాత్ర ఎనలేనిది. ఈ పథకానికి సంబంధించి జిల్లా వ్యవసాయ శాఖకు జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది.
- పారిశుధ్య వ్యవస్థలో పనిచేసే సఫాయి మిత్రులకు వ్యక్తిగత పరికరాలు అందజేయడంతో పాటు రూ.2.79 కోట్ల రుణాలు అందించి, వారికి అవసరమైన యంత్రాలు సకాలంలో సమకూర్చడంతో సఫాయిమిత్ర సురక్ష చాలెంజ్‌లో నెల్లూరు నగరపాలక సంస్థకు దేశంలోనే ప్రథమ స్థానం లభించడంతో కలెక్టర్‌కు మరోసారి నేషనల్ పురస్కారం లభించింది.
- డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 47,034 పొదుపు సంఘాలకు 36,469 పొదుపు సంఘాలు ఏ గ్రేడ్ సాధించి రాష్ట్రంలోనే అత్యధిక ఏగ్రేడ్ పొదుపు సంఘాలు కలిగిన జిల్లాగా నెల్లూరును ప్రథమ స్థానంలో నిలిపినందుకు కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది.
- కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్రం సూచించిన కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వర్తించినందుకు దేశంలోనే నాలుగో ర్యాంకు లభించింది. ఈ ర్యాంకింగ్‌కు జాతీయ పురస్కారం లభించింది.
- మత్స్య సంపద ఉత్పత్తి పెంపొందించడంలో పాటు ఎగుమతులు పెంచడంలో జిల్లాకబెస్ట్ మెరైన్ డిస్ట్రిక్‌గా ఎంపిక కావడంతో వరల్డ్ ఫిషరీస్ డేన జాతీయ స్థాయి అవార్డు లభించింది.
- జిల్లాలో గ్రామ పంచాయతీలకు రెండేళ్ల కాలంలో ఏడు జాతీయ అవార్డులు లభించాయి. గ్రామ పంచాయతీలకు చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డులు, దీనదయాళ్ ఉపాధ్యాయ పురస్కారాలు, నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గౌరవ్ పురస్కారాలు లభించాయి. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా 100 శాతం ఓడీఎఫ్ ప్లస్ లక్ష్యాలు సాధించడంలో జిల్లా పంచాయతీ విభాగానికి నగదు పురస్కారం లభించేలా చేశారు.
- తాజాగా కలెక్టర్ చక్రధర్‌బాబును మరో అవార్డు వరించింది. 2022లో ఆత్మకూరు ఉప ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం కలెక్టర్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేస్తూ మంగళవారం సందేశాలు జారీ చేసింది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా ఈ అవార్డులను కలెక్టర్ స్వీకరిస్తారు.

ఓటే ఆయుధం

- జిల్లా ఓటర్లు 19,13,321 మంది
- పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ
- 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలి
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం



నెల్లూరు (అర్బన్): ఎక్కడైతే ఎక్కువ మంది ఓటర్లుగా నమోదు చేసుకుని, ఓటు హక్కుని వినియోగించుకుంటారో ఆ దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఓటే వజ్రాయుధం. తమ ఓటుతో మంచి వారిని ఎన్నుకోవడంతో పాటు చెడ్డ వారిని రాజకీయాలకు దూరం చేయొచ్చు. మంచి పాలన ద్వారానే దేశం పురోభివృద్ధి చెందుతుంది. అందువల్లనే ఎన్నికల సంఘం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరుతుంది. ఆ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఓటు నమోదును నిరంతర కార్యక్రమంగా మార్చింది. ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీని జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంగా ప్రకటించి ప్రజలను చైతన్యం చేస్తోంది. బుధవారం జిల్లాలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు హక్కును కల్పిస్తోంది.

జిల్లాలో 19,13,321 మంది ఓటర్లు

విభజన తర్వాత జిల్లాలో 19,13,321 మంది ఓటర్లున్నారు. స్త్రీ ఓటర్లు 9,73,802 మంది కాగా పురుష ఓటర్లు 9,39,273 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా స్త్రీ ఓటర్లు 34,529 మంది ఎక్కువగా ఉండడం విశేషం. వీరు కాకుండా థర్డ్ జెండర్స్ మరో 246 మంది ఓటర్లున్నారు. ఎన్నికలు జరిగేటప్పుడు సుమారు 70 శాతం మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇది కాస్త 90 శాతం పెరిగితే మంచి పాలకులను ఎన్నుకోవచ్చు.

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
కందుకూరు	2,21,434
కావలి	2,44,367
ఆత్మకూరు	2,16,382
కోవూరు	2,65,720
నెల్లూరు సిటీ	2,33,135
నెల్లూరు రూరల్	2,62,277
సర్వేపల్లి	2,31,815
ఉదయగిరి	2,38,191

జేఈఈ మెయిన్ తొలివిడత ప్రారంభం



కొడవలూరు: పరీక్షకు హాజరయ్యేందుకు వెళ్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రం బయట వేచి ఉన్న తల్లిదండ్రులు

- 1,370 మంది హాజరు

నెల్లూరు(టౌన్): నిట్, ఐఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం జేఈఈ మెయిన్-2023 తొలివిడత పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 1,388 మందికి గానూ 1,370 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొడవలూరు మండలంలోని రాజుపాళెంలో శ్రీవెంకటేశ్వర, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు థర్మల్ స్క్రీనింగ్ చేశారు. అలాగే మాస్క్‌లను అందజేశారు. కేంద్రంలోకి గంటన్నర ముందుగానే అనుమతించారు. శ్రీవెంకటేశ్వర కళాశాలలో ఉదయం అరగంటపాటు కంప్యూటర్లు మొరాయించడంతో అదనంగా అరగంట సమయాన్ని కేటాయించారని విద్యార్థులు తెలిపారు. ఎన్‌బీకేఆర్ కళాశాలలో సైతం ఒకరిద్దరి కంప్యూటర్లలో సమస్యలు రావడంతో వారికి అదనపు సమయం ఇచ్చారని తెలిసింది.



కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

లోకేష్‌కు జయంతికి, వర్ధంతికి తేడా తెలియదు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): టీడీపీ నాయకుడు నారా లోకేష్‌కు జయంతికి, వర్ధంతికి తేడా తెలియదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులో మంత్రి విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్రను పెద్ద జోక్‌గా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కొడుకు హోదాలోనే లోకేష్ ఎన్నికల్లో విజయం సాధించలేదన్నారు. అర్థం కాకుండా మాట్లాడటంలో ఆయన దిట్ట అన్నారు. రాష్ట్రంలో టీడీపీ ఉనికి కోల్పోతుంటే.. వైఎస్సార్‌సీపీ మరింత బలపడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. పార్టీలు, ప్రాంతాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

తీరంలో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు

ఇందుకూరుపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని మైపాడు తీరంలో రిసార్ట్స్ సమీపంలో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అప్పట్లో మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా మండలంలోని మైపాడు తీరంలో ఉప్పు సత్యాగ్రహం చేపట్టిన విషయం తెలిసిందే. కాగా దండి యాత్ర పునఃప్రదర్శన సందర్భంగా అప్పట్లో నెల్లూరు నుంచి మైపాడు వరకు 120 మంది వరకు పాదయాత్ర చేశారు. ప్రస్తుతం మైపాడు బీచ్‌లో గాంధీ, నెహ్రూ, సరోజినీనాయుడు తదితరుల విగ్రహాల ఏర్పాటుకు పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. అలాగే దండి యాత్రలో పాల్గొన్న జిల్లాలోని అప్పటి సమరయోధుల వివరాలను సేకరించి వారి పేర్లతో కూడిన శిలాఫలకాన్ని పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. శరవేగంగా సాగుతున్న ఈ పనులను జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవానీ మంగళవారం పరిశీలించారు. రిపబ్లిక్‌డే సందర్భంగా ఈనెల 26వ తేదీన కలెక్టర్ చక్రధర్‌బాబు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కల్పన, టూరిజం శాఖ డివిజనల్ మేనేజర్ శివారెడ్డి, మైపాడు రిసార్ట్స్ మేనేజర్ సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల వద్ద అధికారులు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 104
లేయర్ (లైవ్) : 95
బ్రాయిలర్ చికెన్ : 186
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 204
లేయర్ చికెన్ : 162

పొదలకూరు



నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.25
సన్నవి : రూ.12
పండ్లు : రూ.5

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

- జేసీ కూర్మనాథ్
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

నెల్లూరు(వేదాయపాళెం): 'బాలికల సంరక్షణ మనందరి బాధ్యత. వారు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నాం.' అని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. దీనిని జేసీ ప్రారంభించారు. స్థానిక సర్వోదయ కాలేజీ నుంచి ప్రారంభమైన ర్యాలీ వీఆర్సీ సెంటర్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఆడపిల్లలను రక్షించండి.. ఆడపిల్లలను చదివించండి అని ప్రతిజ్ఞ చేశారు. తర్వాత కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సభ జరిగింది. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ ఆడ, మగ వ్యత్యాసం ఉండకూడదని, ఇద్దరిని సమానంగా చూసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి మాట్లాడుతూ బాలికల పట్ల సమాజంలో ఉన్న వివక్ష పోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సమత, సమగ్రశిక్ష ఏడీ ఉషారాణి, ఆర్‌ఐ వరప్రసాద్, బీసీ సంక్షేమ శాఖాధికారి వెంకటయ్య, డీవీఈఓ మధుబాబు, వైద్యశాఖ డెమో అధికారి శ్రీనివాసరావు, అర్బన్ సీడీపీఓ అనురాధ, సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ కూర్మనాథ్

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నరసింహులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ సీఎం కప్ రాష్ట్రస్థాయి హాకీ, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే మహిళలు, పురుషుల జిల్లా జట్ల ఎంపికలను మంగళవారం నెల్లూరులో నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ బోర్డు సభ్యుడు కె.నరసింహులు, సెట్నల్, డీఎస్‌ఏ సీఈఓ డి.పుల్లయ్య, చీఫ్ కోచ్ ఆర్కే ఎతిరాజ్ ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారని తెలిపారు. బుధవారం ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ ఎంపికలను నిర్వహిస్తామని తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- నలుగురికి తీవ్రగాయాలు

కావలి రూరల్: హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారు లారీని ఓవర్‌టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొనడంతో రమణమ్మ (64) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం ఉదయం కావలిలోని గౌరవరం జాతీయ రహదారి వద్ద జరిగింది. ఎస్సై ఎం.వెంకట్రావు కథనం మేరకు.. తిరుపతి జిల్లా, దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామానికి చెందిన సంచి శ్యామ్ అతని భార్య శ్రావణి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. శ్యామ్, అతని తల్లి రమణమ్మ, భార్య శ్రావణి, స్నేహితులు వేణు, భానుప్రకాష్‌తో కలిసి హైదరాబాద్‌లో ఇల్లు చూసేందుకు కారులో వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరగా గౌరవరం వద్దకు చేరుకోగానే కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టెక్ చేయబోయి డివైడర్ ఢీకొని బోల్తా పడింది. దీంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. శ్యామ్ కొడుకు రెండు సంవత్సరాల బాబుకు ఏమీ కాలేదు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



రమణమ్మ మృతదేహం

ఫిబ్రవరి 15లోగా ఫీజు చెల్లించాలి

ఇందుకూరుపేట: 2015-17 నుంచి 2018-2020 విద్యా సంవత్సరాల మధ్య డీఎల్‌ఈడీ చదివిన ఛాత్రోపాధ్యాయుల్లో మొదటి సంవత్సరం ఫెయిలైన వారికి ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.150, 3 సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక సబ్జెక్టుకు రూ.100 వంతున చెల్లించాలన్నారు. 28వ తేదీలోగా అయితే రూ.50 అపరాధరుసుముతో చెల్లించే అవకాశం ఉందని తెలియజేశారు.